92

# మనిషికన్న మృగం నయం!

మనిషిని గురించిన నిర్వచనాలు బోలెడన్ని ఉన్నాయి. అందులో వొకటి 'రెండు కాళ్ళ జంతువు'' అనేది ఆకస్మికంగా విన్నప్పుడు ఈ నిర్వచనం అమానుషంగా కనిపిస్తుంది. మానవ ద్వేషంతో కుతకుతలాడిపోతున్న మందభాగ్యుడెవడో కసికొద్దీ ఈ మాట అని ఉంటాడని మనకు తోస్తుంది. కానీ, రామస్వామి గాధవింటే ఈ నిర్వచనం కూడా ''సబబే సుమా'' అనిపించక మానదు.

రామస్వామి పూర్వీకులది కనిగిరి తాలూకాలోని ఓ చిన్న పల్లెటూరు. అంతో ఇంతో కొంద్ర ఉంది. దాన్నే నమ్ముకొని కాలక్షేపం చేస్తున్నారు. రామస్వామి తండ్రి పెద్ద వ్యవహర్త 'కిష్టయ్యగారి తీర్పు' అంటే మరింక దానికి తిరుగు ఉండేది కాదు. వేలెత్తి చూపించుకోకుండా బతికాడాయన.

''అందరిలోకి నేనే పెద్దోణ్ని బాబూ!'' అన్నాడు రామస్వామి. ఎలుగుబంటి సిగమోర ముడిని గట్టిగా బిగించుతూ ''నేనూ అలాగే బతుకుదామనుకున్నా, కానీ భగవంతుడు నాకారాత లేకుండా చేశాడు'' అని వాపోయాడు రామస్వామి.

రామస్వామి తండ్రికి రెండు సంబంధాలు. ఇతన్నీ, తమ్ముణ్ణి కన్న తరువాత పెంచలమ్మ చచ్చిపోయింది. కిష్టయ్య బిడ్డల్ని చూసుకొంటూ బతుకుదామనుకున్నాడు. కానీ ఇరుగు పొరుగువాళు ళ్ళ అతన్నలా ఉండనివ్వలేదు. రెండు తులాల బంగారమూ, 15 గొర్రెల్ని ఓలిగా ఇచ్చి లచ్చుమమ్మను పెళ్ళాడాడు కిష్టయ్య. అప్పణ్ణించే ఆ సంసారంలో రవరవలు ప్రారంభమయినై.

''మా పిన్నమ్మ కూడా మంచిదే దొరా! ఆమె తమ్ముడితోనే చచ్చిన చావుగా ఉంది. వాడు పరమ దొంగనాకొడుకు. కుప్పలు దోస్తాడు. మందలో పడి జీవాల్ని కాజేస్తాడు. తాగుతాడు. మనుషుల్ని సంపుతాడు. కర్ర, కత్తి లేకుండా తిరగనే తిరగడండీ! అంతకుముందు మా అయ్య తాగి ఎరుగడండీ బాబయ్యా! ఏదన్నా పండుక్కో పబ్బానికో, ఓ రెండు మూడు ముంతలు తాగేవాడు. ఈ నా కొడుకు మా పాల పడ్డప్పణ్నించీ కల్లుపాకలోనే కాపరం పెట్టాడు'' అన్నాడు రామస్వామి.

అలా అంటున్నప్పుడు రామస్వామి కళ్ళు నీటితో నిండిపోయాయి.

''మా నాన్న ధర్మరాజేననుకోండి బాబూ! పల్లెత్తి పరుషంగా మాట్లాడి ఎరుగడు. నన్ను మా తమ్మణ్ణీ పొట్టమీద కూచోబెట్టుకుని పాడేవాడు. మా ఇంటి ముందే పెద్ద చింతచెట్టు ఉండేదండీ. దానికి ఉయ్యాల వేసి ఊపేవాడు. నేను పొలం వస్తానని మారాం చేస్తే, భుజం మీద కూచోబెట్టుకొని పొలం దాకా తీసుకుపోయేవాడు. నాకు అన్నం చాలదేమోనని, నేను అన్నం తిన్న తరువాతే తను తినేవాడండీ!'' అన్నాడు రామస్వామి తండ్రిని తలచుకొంటూ.

అలాంటి కిష్టయ్య, ఏడాది తిరక్కముందే కల్లుముంతకు కట్టుబానిసయిపోయాడు. చీటికి మాటికి తమను కోప్పడుతూ ఉండేవాడు. ఆ కోపం ముదిరినప్పుడు చెయ్యి కూడా చేసుకొనేవాడు. ఇరుగు పొరుగు వాళ్ళు అడ్డం వచ్చినా ఆగేవాడు కాదు. చావ చితకబాదిన తర్వాత తిక్కకాస్తా దిగిపోయిన తరువాత, పిల్లల్ని చాటుకు తీసుకుపోయి బావురుమని ఏడిచేవాడు.

''రెండు మూడేళ్ళకే మా నాన్న అన్ని విధాలా గుల్లయిపోయాడండీ! మా పినతల్లి మా నాన్నకేదో పసరు పోసిందని అనేవాళ్ళు. మా పిన్నమ్మ మమ్మల్ని చచ్చేటట్లు కొట్టినా మా నాన్న అదిలించేవాడు కాదండీ! ఇంకా బాధలు చూడలేక సాంబయ్యగారు నన్నూ నా తమ్ముణ్ని మా అమ్మ చెల్లెలి దగ్గర వొదిలి పెట్టాడండీ! మా చుక్కమ్మ పిన్ని మంచిది. దేవత! మా బాబాయి కూడా మంచోడే! ఆయన

జీవాన్ని ఆడిస్తూ ఊరూరూ తిరుగుతుండేవాడు. ఆయనతో బాటు నేనూ, తమ్ముడూ కూడా తిరిగే వాళ్ళం."

ఎలుగుబంటితో, అప్పుడే రామస్వామికి పరిచయమయింది. చిన్నాన్న చేసే పనులన్నీ రామస్వామి గమనిస్తూ ఉండేవాడు. తెలియని కిటుకుల్ని చిన్నాన్న కూడా రామస్వామికి చెబుతుండేవాడు.

రామస్వామికీ ఎలుగుబంట్లతో బాగా దోస్తీ ఏర్పడింది. దాని అవసరాలేమిటో అతను సులువుగా తెలుసుకోగలడు. పసిబిడ్డలతో ఆడుకొన్నంత సులభంగా అతను ఎలుగుబంట్లతో ఆడుకోగలడు.

"పెద్దయ్యాక ఎలుగుకు ఏది నేర్పాలన్నా సాధ్యం కాదండీ, చిన్నప్పణ్నించీ సాధనం చేయాలి. ఏదో వొక గుర్తు చెప్పి ఒక పని దానిచేత చేయించాలి. అలా రోజులకొద్దీ సాధనం చేశాక, ఆ గుర్తు ఎవరు చేసినా జీవం ఆ పని చేస్తుందండీ! ఈ ఎలుగ్గొడ్డు పేరు 'సింగన్న', చాలా మంచోడండీ! ఒక చేత్తో సలాం చేస్తుంది. రెండు చేతులతో దణ్ణం పెడుతుంది. ముందు కాళ్ళను నేల కానించి వెనక్కాళ్ళను పైకెత్తి నడుస్తుంది. అచ్చంగా వెనక్కాళ్ళతోనూ నడుస్తుంది. ఆ మధ్యనో సర్కసు కంపెనీ వాళ్ళు రెండు వేలు ఇస్తామనీ, అమ్మమనీ అడిగారండీ. మా ఆవిడ అమ్మమని శత పోరింది. నేనే వొప్పుకోలేదు. పదేళ్ళుగా ఇది నన్నూ, నా పిల్లల్నీ పోషిస్తున్నది బాబయ్యా! అన్నం పెట్టిందాన్ని అమ్ముకోడానికి, ప్రాణం వొప్పలేదండీ!" అన్నాడు రామస్వామి; సింగన్న గాడి ముట్టె నిమురుతూ.

తన బేరానికి ఇంత వరకూ ఢోకా లేదన్నాడు రామస్వామి. పల్లెల కెళ్ళినా పట్నాలకెళ్ళినా, తన చుట్టూ జనం మూగుతారన్నాడు. సగానికి సగం మంది ఆట చూసి పోయినా, మిగిలిన సగంమందీ ఐదేసి పైసలూ, పదేసి పైసలూ వేసినా జేబునిండుతుందన్నాడు.

పల్లెటూళ్ళయితే గింజలు, అన్నం దొరుకుతాయనీ, బస్తీల్లో డబ్బులు దొరుకుతాయనీ అన్నాడు.

రామస్వామికిప్పుడు ముగ్గురు పిల్లలు, ముగ్గుర్నీ తన బావమరిది దగ్గరుంచాడు. తన బావమరిది బిట్రం గుంటలో రైల్వేలో పనిచేస్తున్నాడనీ, పిల్లలు అక్కడ చదువుకొంటున్నారనీ చెప్పాడు రామస్వామి.

"మా అయితే ఇంకో రెండు మూడేళ్ళకన్నా ఎక్కువ తిరగలేను బాబయ్యా! ఈలోగా మా పెద్దాడు పదో తరగతి కొస్తాడు. ఏ అయ్యా కాళ్ళో పట్టుకొని వాడికింత పని ఇప్పిస్తే నాకిక దిగులుండదు."

రామస్వామి తన భార్యను చూపించాడు. ఆవిడ లేవలేకుండా ఉంది.

చేతిలో ఉన్న తాడును సన్నగా కదిపాడు. ఎలుగుబంటి వో కాలెత్తి సలాం చేసింది. ఇంకో రకంగా తాడును కదిలించాడు. రెండు కాళ్ళూ ఎత్తి 'నమస్కారం' చేస్తున్నట్లుగా కదిపి, ముట్టె ఆ కాళ్ళమీద ఆనించింది.

"మనిషికీ జంతువుకూ అదే తేడా! మనిషి చెప్పేదొకటీ చేసేదొకటీ బాబయ్యా ఇదుందే, ధర్మరాజు ఏం చెపితే అదే చేస్తుంది. ఏం కావాలో అదే చేస్తుంది. విశ్వాసం దీని సొత్తు" అన్నాడు రామస్వామి.

విశ్వాస ఘాతకులూ, నమ్మకద్రోహులూ, క్షణక్షణానికి పెరిగిపోతున్న ఈ కాలంలో రామస్వామి అన్నమాటలు అక్షరాలా నిజమే అనిపిస్తుంది కదూ!